క్లుప్తంగా

ఆర్థిక సహాయం అందజేత



మహిళకు నగదు అందజేస్తున్న సర్పంచ్ రవిబాబు, సంస్థ సభ్యులు

లింగపాలెం : కలరాయునగూడెం గ్రామానికి చెందిన మల్లెపు మంగ నాగేంద్ర అనే మహిళ లివర్ వ్యాధితో బాధపడుతుండడతో ఆమెకు వైద్యం నిమిత్తం శ్రీసాయి హెల్పింగ్ హ్యాండ్స్ గ్రూప్ సంస్థ ఆదివారం రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేసింది. సర్పంచ్ చలగుళ్ల రవిబాబు చేతుల మీదుగా ఈ నగదును అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు గుంటూరి శ్రీనివాసరావు, బెజవాడ ధర్మారావు, ఎం.రంగారావు, సీహెచ్ సాల్మన్‌రాజు, టీవీ చలపతిరావు, జి.మోహనరావు, వెంప విశ్వేశ్వరావు, విద్యాకమిటీ చైర్మన్ నందిగం ఉమా మహేశ్వరరావు పాల్గొన్నారు.

చెత్త తరలించే రిక్షా బహూకరణ



రిక్షాను ప్రారంభిస్తున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని 8వ వార్డుకు చెత్త తరలించే రిక్షాను దాత పాలపరి సత్యనారాయణ ఆదివారం బహూకరించారు. ఈ రిక్షాను మునిసిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో మున్సిపాలిటీలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. దీనికి దాతల సహకారం తోడవడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో తానిగడప వేణు, మర్లపూడి దీవెనరావు, ముప్పిడి వెంకటేష్, పులపాకుల మోషే, ముప్పిడి హేజికీయ, మహిళలు పాల్గొన్నారు.

లలితాపరమేశ్వరి చైతన్యాన్ని గుర్తించాలి



శిక్షణలో పాల్గొన్న ధ్యానులు

జంగారెడ్డిగూడెం : విశ్వశక్తే శ్రీలలితాపరమేశ్వరి చైతన్యమని, లక్ష్యసాధన లిప్తకాలంలో అందించే లలితను ధ్యానం ద్వారా గుర్తించడమే మహోన్నతస్థితి అని విజయవాడకు చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ జి.శ్రీదేవి అన్నారు. ది జంగారెడ్డిగూడెం పిరమిడ్ స్పిరిట్యువల్ ట్రస్ట్ నిర్వహణలో స్థానిక శేషాద్రినగర్ లోని గౌరీ సుభద్ర పిరమిడ్ ధ్యానకేంద్రంలో ఆత్మజ్ఞాన ధ్యానశిక్షణలో భాగంగా 'లలితా సహస్రనామ అంతరార్థం' అనే అంశంపై ఆదివారం ఉదయం 9.30 నుంచి 5 గంటల వరకూ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ధ్యానం ప్రదేశాలకు, ప్రాంతాలకు, భాషకు, భావాలకు పరిమితమై ఉండదని, విశ్వంలో ఉండే ప్రతి జీవుడు శ్వాస ద్వారా తాను స్వీకరించే ప్రాణశక్తే అందరిలో ఉన్నదన్న సత్యం ధ్యానం ద్వారా అనుభవపూర్వకంగా తెలుసుకోగలుగుతాడని, అదే లలితాపరమేశ్వరి చైతన్యమని శిక్షకురాలు శ్రీదేవి తెలిపారు. అనంతరం ఆమెను పిరమిడ్ ట్రస్ట్ అధ్యక్షుడు కాకి రామకృష్ణ, ట్రస్ట్ సభ్యులు కొలనువాడ శిరీష, వందనపు కృష్ణకుమారి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ట్రస్ట్ కార్యదర్శి తటవర్తి కృష్ణ పాల్గొన్నారు.

నేడు సచివాలయ కన్వీనర్లకు అవగాహన

కామవరపుకోట : గ్రామ సచివాలయ కన్వీనర్లకు సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మిడతా రమేష్‌బాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సొసైటీ పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న ఆర్యవైశ్య కళ్యాణ మండపం వద్ద నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. మండలంలోని పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

జూదరుల అరెస్ట్

జంగారెడ్డిగూడెం : కోడిపందేలు ఆడుతున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. తమకు అందిన సమాచారంతో జంగారెడ్డిగూడెం శివారులో దాడి చేసి ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.1,500 నగదు, 1 కోడిపుంజు, 1 కోడి కత్తి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు

పెదవేగి : మహిమ గల తల్లి రాట్నాలమ్మకు సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెదవేగి మండలం రాట్నాలకుంటలో కొలువైన అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ వారం అమ్మవారికి పూజా టికెట్లపై రూ.39,305, విరాళాలు రూ 48,109, లడ్డూ ప్రసాదం విక్రయాల ద్వారా రూ. 29,760, ఫొటోల అమ్మకంపై రూ. 635, మొత్తం రూ. 1,17,809 ఆదాయం లభించిందని దేవస్థాన చైర్మన్ చల్లగొళ్ల వెంకటేశ్వరరావు తెలిపారు.

టారెత్తిస్తున్న ఎండలు


- వేసవి ప్రారంభంలోనే భగభగలు
- రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు



ఎండతీవ్రత తాళలేక తలపై తుండు కప్పకుని వెళుతున్న వ్యక్తి



క్షేత్రానికి వచ్చిన ఒక భక్తురాలు చంటిబిడ్డతో ఇలా..



మంచినీరు తాగుతూ..

ద్వారకాతిరుమల: వేసవి ప్రారంభంలోనే ఎండలు టారెత్తిస్తున్నాయి. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. వాతావరణం నిప్పుల కొలిమిని తలపిస్తోంది. దీంతో ప్రజలు అల్లాడి పోతున్నారు. గత నాలుగు రోజులుగా ఎండల తీవ్రత మరింతగా పెరిగింది. మార్చి ప్రారంభంలోనే ఎండలు ఈ రకంగా ఉంటే, ముందు ముందు పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఉదయం 10 గంటలకే ఎండ తీవ్రత అధికమౌతుండటంతో, ప్రజలు బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. ఎండలు పెరగడంతో అప్పుడే కొబ్బరి బొండాలు, పుచ్చకాయలు, ముంజెలు, మజ్జిగ, అలాగే శీతల పానియాల విక్రయాలు ఊపందుకున్నాయి. అయితే పెరుగుతున్న ఉష్ణోగ్రతలను బట్టి ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

వడదెబ్బ రకాలు

తొలి దశ – ఈ దశలో దేహం ఉష్ణాన్ని అధికంగా స్వీకరిస్తుంది. ఈ దశలో గొంతు ఎండిపోవడం, నీరసంతో పాటు వాంతులు వచ్చినట్లు అనిపిస్తుంది. ఈ పరిస్థితి కనిపించినప్పుడు తగినంత మంచి నీటిని, నిమ్మకాయ, ఉప్పు, పంచదార కలిపిన నీళ్లు అధికంగా తీసుకోవాలి.

రెండో దశ – ఈ దశ విషయానికొస్తే ఉష్ణ తీవ్రత కారణంగా జ్వరం వచ్చే అవకాశం ఉంటుంది. దీని వల్ల దేహం వేడెక్కిపోతుంది. ఉక్కిరిబిక్కిరిగా ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో చల్లని నీటిలో వస్త్రాన్ని తడిపి, వారికి దేహమంతా తుడవాలి. ఈ సమయంలో ఐస్ క్యూబ్స్‌ను వినియోగించుకోవచ్చు. అయితే ఛాతిపై మాత్రం తుడవకూడదు.

మూడో దశ – ఈ దశ అత్యంత ప్రమాదకరం. వడదెబ్బ తగిలిన వ్యక్తి దేహం అంతా పాడిబారుతుంది. మనిషి స్పృహ తప్పి కోమాలోకి వెళ్లే అవకాశం ఉంది. ఈ పరిస్థితి ఏర్పడితే ఇంటి వద్ద వైద్యం పనికిరాదు. సమీపంలోని ఆసుపత్రికి సకాలంలో వెళ్లాలి. దీర్ఘకాలిక వ్యాధులు ఉండి, ఏళ్ల తరబడి మందులు వాడే వారికి వడదెబ్బ సమస్య అధికంగా ఉంటుంది. వీరిలో చమట గ్రంధులు పూడుకుపోయి, దేహాన్ని చల్లబరిచే ప్రక్రియ స్తంభించి పోతుంది. ఈ పరిస్థితులు వడదెబ్బకు కారణమౌతాయి.

వీటిని తీసుకోవాలి

ఉష్ణ ప్రభావానికి దేహంలోని నీరు అధికంగా చెమట రూపంలో బయటకు పోతుంది. అందువల్ల దేహంలో తిరిగి నీరు నింపుతుండాలి. సహజ సిద్ధంగా లభించే కొబ్బరి నీరు దీనికి చాలా మంచిది. వేసవిలో విరివిగా లభించే పుచ్చకాయను అధికంగా తీసుకోవడం వల్ల దేహానికి సరిపడినంత నీరు లభిస్తుంది. వేసవి ఉపసమనానికి ఇది మంచి ఫలం. అలాగే వేసవిలో వచ్చే మామిడి పండ్లు తినడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.

కంటికి రెప్పలా కాపాడుకోవాలి

పెరుగుతున్న వేసవి ఉష్ణోగ్రతల నుంచి చిన్నారులను కంటికి రెప్పలా కాపాడుకోవాలని పిల్లల వైద్య నిపుణులు సూచిస్తున్నారు. పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అంటున్నారు. అనుక్షణం వీరిని గమనిస్తూ ఉండాలని అంటున్నారు. ఉదయం 8 గంటల తరువాత సాయంత్రం 6 లోపు చంటి పిల్లలతో బయటకు వెళ్లవద్దని సూచిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోను పిల్లలతో ద్విచక్ర వాహనాలపై ప్రయాణం చేయకూడదని చెబుతున్నారు. చెమటను పీల్చుకునే తెల్లని కాటన్ వస్త్రాలను మాత్రమే వేయాలి. తలకు, ఒంటికి నూనె రాయకూడదు. ఈ నూనె దేహంలోని స్వేద గ్రంధుల వద్ద అడ్డుగా ఉండి, చెమటలను బయటకు రానివ్వకుండా నియంత్రిస్తుంది. ఫలితంగా దేహంలో ఉష్ణోగ్రత పెరుగుతుందని వైద్యులు అంటున్నారు. చిన్నారులకు ఎక్కువగా చెమట పడుతుంటే ఓఆర్ఎస్ ద్రావణాన్ని, ఉప్పు కలిపిన గంజి గానీ, మజ్జిగ లేకుంటే కొబ్బరి నీరు పట్టించాలని అంటున్నారు. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగించాలని చెబుతున్నారు. వీరిని సాధ్యమైనంత వరకు చల్లని ప్రదేశంలో ఉంచితే మంచిదని సూచిస్తున్నారు.

అధిక వ్యాయామం.. అనర్థం

ప్రస్తుత తరుణంలో అధిక శాతం మంది ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. అందులో భాగంగా ఎక్కువ మంది వ్యాయామానికి సమయం కేటాయిస్తున్నారు. అందులోనూ నడక సాగించే వారే అధికంగా ఉంటున్నారు. అయితే వేసవిలో వ్యాయామం అధికంగా చేయడం శరీరానికి చేటు కలిగిస్తుందని వ్యాయామ నిపుణులు చెబుతున్నారు. వ్యాయామానికి ముందు, ఆ తరువాత అర లీటరు నుంచి లీటరు నీటిని తీసుకోవడం మంచిదని అంటున్నారు. వాకింగ్‌కు వెళ్లేవారు తప్పనిసరిగా మంచి నీటిని వెంట తీసుకెళ్లాలని సూచిస్తున్నారు.

జాగ్రత్తలు పాటించాలి



ఎండ తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. ప్రజలు జాగ్రత్తగా ఉండాలి. ఓఆర్ఎస్ ద్రావణం, మంచి నీరుతో పాటు పుచ్చకాయ, కొబ్బరి బొండం నీరు అధికంగా తీసుకోవాలి. అత్యవసర పని ఉంటేనే గానీ ఎండలో బయటకు వెళ్లకూడదు. వ్యాయామం చేసేవారు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. అలాగే చిన్నారులను చల్లని ప్రదేశంలో ఉంచాలి. కాటన్ దుస్తులను మాత్రమే ధరించాలి. వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే, వెంటనే ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందాలి.

– డాక్టర్ ప్రవీణ్‌కుమార్, ద్వారకాతిరుమల పీహెచ్‌సీ వైద్యుడు

జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం



విలేకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో పరుగులు పెడుతుందని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. విశాఖపట్నంలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ విజయవంతంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ వేదికగా సుమారు 14 రంగాల్లో పెట్టుబడులు వస్తాయని ఆశిస్తే ఏకంగా 20 రంగాల వరకూ పెరిగాయని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంపై పారిశ్రామిక వేత్తలు విశ్వసిస్తున్నారని అనడానికి ఇదే నిదర్శనమన్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా ఈ కార్యక్రమంలో 340 పెట్టుబడులకు ఒప్పందాలు కుదరడం అభినందనీయమని అన్నారు. ఈ సమ్మిట్ ద్వారా సుమారు 6 లక్షల వరకూ ఉద్యోగ అవకాశాలు లభించే అవకాశం ఉందని అన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డికి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు విషప్రచారం చేస్తున్నాయని అన్నారు. గత ప్రభుత్వ పాలనలో చంద్రబాబు రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురాకుండా అంతా గ్రాఫిక్‌ల ద్వారానే రాష్ట్ర అభివృద్ధిని చూపించారని దుయ్యబట్టారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తన సొంత ఇమేజ్‌తోనే రాష్ట్రానికి పెట్టుబడులు వచ్చేలా కృషి చేస్తున్నారని అన్నారు.

నేడు దుర్గా మల్లికార్జున స్వామి కల్యాణోత్సవం



పూజలు అందుకుంటున్న కనకదుర్గమ్మ

కొయ్యలగూడెం : బయ్యనగూడెంలో కొలువుదీరిన శ్రీ చక్ర సహిత కనకదుర్గమ్మ 13వ వార్షిక మహోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం అయ్యాయి. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం శ్రీ చక్ర స్నానం, పంచామృతాభిషేకం, రాత్రి 7 గంటలకు శ్రీ దుర్గా మల్లికార్జున స్వామి కల్యాణోత్సవం అర్చకులు వీఎస్ఎన్ మూర్తి., ధర్మకర్త తోరం సుబ్బారావుల ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ప్రారంభ రోజున గణపతి పూజ, పంచామృతాభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. ఏడో తేదీ వరకు అమ్మవారి ఉత్సవాలు నిర్వహించనున్నారు.

9న సీపీఆర్‌పై ఉచిత శిక్షణ



సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, సురక్ష డాక్టర్ దిలీప్ కుమార్

కొయ్యలగూడెం : సీపీఆర్ (కార్డియో పల్మనరీ రిసిస్కిటేషన్)పై శిక్షణ కార్యక్రమం ఈ నెల 9వ తేదీ నిర్వహిస్తున్నట్లు జగనన్న సచివాలయ మండల కోఆర్డినేటర్ నూకల రాము పేర్కొన్నారు. ఆదివారం జంగారెడ్డిగూడెం రోడ్‌లోని జ్యూస్ సెంటర్ కాంప్లెక్స్ వద్ద వైఎస్సార్ సీపీ యూత్ నాయకుడు సనమండ్ర మధుకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వెంకటేశ్వర ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో సురక్ష హాస్పిటల్ అధినేత కొండముది దిలీప్ కుమార్, గైనకాలజిస్ట్‌ల నిపుణులు శిక్షణ ఇస్తారన్నారు. పరింపూడి పరిధిలోని నాలుగు సచివాలయాల కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులకు ఈ శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సోషల్ వర్కర్లు కూడా హాజరుకావచ్చని తెలిపారు. ప్రస్తుత రోజుల్లో గుండె సంబంధిత మరణాలు ఎక్కువగా సంభవిస్తుండడంతో నిత్యం ప్రజల మధ్య ఉండే వారికి ఈ శిక్షణ ఇవ్వడం వల్ల అవగాహన కలుగుతుందని, తక్షణ పరిస్థితుల్లో ప్రాథమిక చికిత్సకు సహకరిస్తుందనే ఉద్దేశంతో ఈ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాజీ ఎంపీపీ మట్టా సత్తిపండు, ఎంపీటీసీ ఘంటసాల సీనమ్మ, ఘంటసాల మధు, మారిశెట్టి శ్రీను, చిటికెన నాగార్జున, వాలంటీర్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

తాటాకిల్లు దగ్ధం.. బాధితులకు ఆర్థిక సహాయం



బాధితులకు ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

బుట్టాయగూడెం : పడమర రేగులకుంట గ్రామంలో ఆదివారం సంభవించిన అగ్నిప్రమాదంలో బరగడ సురేష్, సారాలమ్మకు చెందిన తాటాకిల్లు దగ్ధమైంది. వంట చేస్తుండగా ప్రమాదవశాత్తూ మంటలు చెలరేగి ఇంట్లోని సామాగ్రితో సహా తాటాకిల్లు పూర్తిగా దగ్ధం కావడంతో వారు నిరాశ్రయులయ్యారు. సుమారు రూ.లక్షా 50 వేలు ఆస్తినష్టం వాటిల్లినట్లు చెప్పారు. బాధితులను ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీరావు, వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు, పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొవ్వాసి నారాయణ, సర్పంచ్ తెల్లం జయమ్మతో పాటు పార్టీ శ్రేణులు పరామర్శించి వారికి ఆర్థిక సహాయం అందజేశారు. బియ్యం, దుప్పట్లు, దుస్తులు, నిత్యావసర సరుకులు అందజేశారు. మండల సచివాలయ కన్వీనర్ సింహాచలం, యాండ్ర రవి, కొవ్వాసి వెంకటేశ్వరరావు, బాడిశ భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు. కాగా బాధితులకు రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేశారు. రూ. 5 వేల నగదు, 20 కేజీల బియ్యం, పంచదార, కందిపప్పు, తదితర వస్తువులను తక్షణ సహాయంగా అందజేశారు.

ఆర్వో వాటర్ ప్లాంట్ ప్రారంభం



సావనీర్ విడుదల చేస్తున్న అవంతి ఫీడ్స్ అధినేత ఇంద్ర కుమార్

కొయ్యలగూడెం : కన్నాపురం పంచాయతీ కార్యాలయం వద్ద ఆర్వో వాటర్ ప్లాంట్‌ను అవంతి ఫీడ్స్ అధినేత అల్లూరి ఇంద్ర కుమార్ ఆదివారం ప్రారంభించారు. సర్పంచ్ ఉప్పల పద్మావతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, ఎంపీపీ గంజిమాల రామారావుతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా సుమారు రూ. 40 లక్షల వ్యయంతో గ్రామంలో నిర్మించిన ఆరు వాటర్ ట్యాంకులను ప్రారంభించారు. తన తల్లి తండ్రులు అల్లూరి సుభద్రమ్మ, వెంకటేశ్వరరావుల జ్ఞాపకార్థం ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఇంద్రకుమార్ చెప్పారు. తన తల్లి స్వగ్రామమైన కన్నాపురం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అనంతరం ఫౌండేషన్‌కి సంబంధించిన సేవా కార్యక్రమాల సావనీర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు డాక్టర్ కొడాలి సత్యనారాయణ సూర్యకాంతం దంపతులు, మాజీ సర్పంచ్ కామారెడ్డి బాబురావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కొండపల్లి శివాజీ, పార్టీ గ్రామ కన్వీనర్ గాడిచర్ల సోమేశ్వరరావు సోషల్ వర్కర్ కట్టా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలవెల్లువ కేంద్రం ప్రారంభం



జగనన్న పాలవెల్లువ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ రామకృష్ణారావు

చింతలపూడి : గ్రామీణ మహిళల ఆర్థిక పురోభివృద్ధికి జగనన్న పాలవెల్లువ దోహదపడుతుందని వైఎస్సార్ సీపీ నాయకులు, సర్పంచ్ తాండ్ర రామకృష్ణారావు అన్నారు. మండలంలోని చింతంపల్లి పంచాయతీ, మేడిశెట్టివారిపాలెం గ్రామంలో ఆదివారం జగనన్న పాలవెల్లువ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. మొదటి రోజు 17.3 లీటర్ల పాలను సేకరించారు. పాల సేకరణ కేంద్రాన్ని ప్రారంభించడానికి సహకరించిన జిల్లా కోఆపరేటివ్ అధికారులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని రూట్ –4లో 8 పాల కేంద్రాలు పనిచేస్తున్నట్లు అధికారులు చెప్పారు. మహిళలు ముందుకు వచ్చి పాడి గేదెలను కొనుగోలు చేయడానికి వాణిజ్య బ్యాంకులు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పాడి రైతులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయంలో కాంట్రాక్ట్ ఉద్యోగాలు

దెందులూరు: గోపన్నపాలెంలోని కేంద్రీయ విద్యాలయాల్లో 2023–24 విద్యా సంవత్సరానికి అన్ని టీచింగ్ పోస్టులకు కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేస్తామని ప్రిన్సిపల్ ఎస్.నాగేంద్ర తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఇంగ్లీష్, హిందీ మీడియంలో బోధించే సామర్థ్యం ఉన్నవారందరూ ఈ నెల 7న ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు నిర్వహించనున్న ఇంటర్వ్యూకు హాజరుకావాలని తెలిపారు. అర్హత వివరాలు స్కూల్ ప్రిన్సిపల్‌ను సంప్రదించాలని కోరారు.

బాబా ఆలయంలో.. ధుని

టి.నరసాపురం : మక్కినవారిగూడెం షిర్డీ సాయిబాబా మందిరం వద్ద నూతనంగా నిర్మించిన ధునిని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లపై ప్రత్యేక డ్రైవ్



ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలో ఇంటి కుళాయి కనెక్షన్ సర్వీస్ కట్ చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఏలూరు టౌన్: నగరంలో పన్నుల వసూళ్లపై నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ ఆదేశాలతో రెవెన్యూ అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఆదివారం నగరంలోని వన్‌టౌన్ ప్రాంతంలో పన్ను బకాయిలు అధికంగా ఉన్న ఇళ్లకు కుళాయి కనెక్షన్ నిలిపివేశారు. వన్‌టౌన్ మార్కెట్ ప్రాంతంలో అద్దెలు చెల్లించని కార్పొరేషన్ షాపులకు తాళాలు వేశారు. ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించకపోతే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం ఆదివారం కూడా పన్నులు కట్టించుకునేలా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన పన్నులను ప్రజలు సకాలంలో చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని ఏలూరు కార్పొరేషన్ రెవెన్యూ ఆఫీసర్–1 ఆర్.అరుణ కోరారు. స్పెషల్ డ్రైవ్‌లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నంబూరి రవి, బిల్ కలెక్టర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. కాగా ఏడాదంతా పన్నుల చెల్లింపులపై దృష్టి సారించని రెవెన్యూ సిబ్బంది ఆకస్మికంగా కొరఢా ఝుళిపిస్తూ కుళాయి సర్వీసు కట్ చేయటంపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతుంది.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



జీలుగుమిల్లి హైస్కూల్‌లో గురువును సత్కరించుకుంటున్న పూర్వవిద్యార్థులు



చింతలపూడిలో మల్లెల సౌరభాలు ఖండ కావ్యాన్ని ఆవిష్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి) : జీలుగుమిల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. 1972లో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఒకచోట చేరి 50 సంవత్సరాల సుదీర్ఘ ప్రస్థానంలోని అనుభవాలను నెమరవేసుకున్నారు. నాడు చదువుకున్న రోజుల్లో చిలిపి చేష్టలను, పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. ఆనాటి ఉపాధ్యాయురాలు అంతోనమ్మను ముఖ్యఅతిథిగా ఆహ్వానించి సత్కరించారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు కె.త్రివిక్రమ్, ఎస్‌కే దాదా సాహెబ్, కోరుకొండ రామకృష్ణ, చీమకుర్తి మహేశ్వరరావు, జి.వెంకటరత్నం, జి.శాస్త్రి, బి.వనజ, జీవీఎస్ఎస్ శర్మ, శేఖర్, జి.ప్రసాద్ పాల్గొన్నారు.

చింతలపూడి : స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. 1964–65 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం కలుసుకుని ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. బాల్యం నాటి చిలిపి సంఘటనలను గుర్తుకు తెచ్చుకుంటూ రోజంతా ఉల్లాసంగా గడిపారు. సమావేశంలో పూర్వ విద్యార్థి మల్లెల జయరాజు రచించిన మల్లెల సౌరభాలు అనే ఖండ కావ్యాన్ని రిటైర్డ్ అడిషినల్ డీజీపీ పూరేటి విజయానంద్ ఆవిష్కరించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో రామిశెట్టి సత్యన్నారాయణ, జల్లిపల్లి శివాజీ, డా జయరాజు, డి వీరాచారి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అప్రమత్తత అవసరం



శిబిరంలో ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్న బ్రాహ్మణ సేవా సంఘం ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని హేలాపురి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు, డాక్టర్ ఎంబీఎస్ శర్మ అన్నారు. స్థానిక విజయ గార్డెన్స్‌లోని హేలాపురి బ్రాహ్మణ సంఘ భవనంలో ఆ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. నగరానికి చెందిన ప్రముఖ వైద్య నిపుణులు వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో దాదాపు 1000 మంది పరీక్షలు చేయించుకున్నారు. వారిలో అవసరమైన వారికి గురుప్రసాద్ మిశ్రా ఆధ్వర్యంలో సుమారు రూ.1.50 లక్షల విలువైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి ఎం.భానుమూర్తి, కోశాధికారి ద్రోణంరాజు వెంకట సుబ్బారావు, మెడికల్ క్యాంపు కన్వీనర్ ఎంఎస్ శర్మ, సభ్యులు మద్దాలి భాస్కర శ్రీనివాస్ నాగరాజు, పాలంకి దుర్గా ప్రభాకరం, తమ్మెర రామారావు, కందుకూరి వెంకట సీతారామాంజనేయ శర్మ, తూములూరి విశ్వనాథ శాస్త్రి, మైలవరపు గురుశర్మ, ఏలూరు బ్రాహ్మణ ఐక్య కార్యాచరణ సమితి కార్యదర్శి తురగా రామకృష్ణ, రామచంద్రరావుపేట శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం చైర్మన్ తోలేటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం



చిన్నారుల ఆపరేషన్లకు సీఎంఆర్ఎఫ్ పత్రాన్ని అందజేస్తున్న ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ళనాని

ఏలూరు టౌన్ : సీఎం సహాయనిధి పేదలకు వరం అని ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ళ నాని అన్నారు. సీఎం సహాయనిధి నుంచి ముగ్గురు బాధితులకు ఆదివారం స్థానిక శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో రూ.14.10 లక్షల ఆర్థిక సహాయాన్ని ఆయన అందజేశారు. ఏలూరు నగరం 28వ డివిజన్ తంగెళ్ళమూడికి చెందిన గొర్రెల హేమంత్ (6), 40వ డివిజన్ చేపలతూము సెంటర్ ప్రాంతానికి చెందిన బుసర మోజెస్ (9) అనే ఇద్దరు చిన్నారులు పుట్టుకతోనే మాట్లాడలేక, వినికిడి సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారి తల్లిదండ్రులు స్థానిక కార్పొరేటర్లకు సమస్యను తెలియజేయగా వారు ఎమ్మెల్యే ఆళ్ళనాని దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే నాని .. ప్రత్యేక శ్రద్ధతో ఇద్దరు చిన్నారులకు కొచెలియర్ ఇంప్లాంట్ సర్జరీ చేసేందుకు ఇద్దరు చిన్నారులకు చెరొక రూ.5.30 లక్షల చొప్పున రూ.10.60 లక్షల ఆర్థిక సహాయం మంజూరు చేసిన అనుమతి పత్రాలను వారికి అందజేశారు. అలాగే ఏలూరు వన్‌టౌన్ 11వ డివిజన్ దక్షిణపువీధిలో లివర్ సమస్యతో బాధపడుతున్న వట్టి నాగవెంకట ఆంజనేయులుకు రూ.3.50 లక్షల సీఎం సహాయనిధి చెక్కును అందజేశారు. కార్యక్రమంలో నగర మేయర్ షేక్ నూర్జహాన్, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు మధ్యాహ్నపు బలరాం, పార్టీ నగర అధ్యక్షులు బొద్దాని శ్రీనివాస్, కార్పొరేటర్ తుమరాడ స్రవంతి ఉన్నారు.